ప్రజాకాంక్షకు మంగళం



ఎంవీపీ సెక్టార్–1లో ఆధునికీకరణ పనులు జరుగుతున్న పాత కల్యాణ మండపం

- ఎంవీపీ సెక్టార్–1లో కూలే స్థితికి వీఎంఆర్‌డీఏ కల్యాణ మండపం
- దాని స్థానంలో కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శంకుస్థాపన
- ఆ ప్రతిపాదనను తుంగలోకి తొక్కిన వైనం
- ఆధునికీకరణ పేరుతో మండపం పనులు చేపట్టిన అధికారులు
- పాత భవనానికి మెరుగులెందుకంటున్న స్థానికులు

గత ప్రభుత్వంలో శ్రీకారం

వీఎంఆర్‌డీఏ పాత కల్యాణ మండపం స్థానంలో కన్వెన్షన్ హాల్ నిర్మించాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భావించింది. వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో రూ.4.15 కోట్ల వ్యయంతో హాల్‌ను నిర్మాణానికి విధివిధానాలు సిద్ధం చేశారు. సెల్లార్+ 2 ఫ్లోర్స్‌గా దీని నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఈ కట్టడంలో సెల్లార్‌ను పూర్తిగా పార్కింగ్ కోసం కేటాయించడం, రెండు అంతస్తుల్లో 5000 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు భారీ హాళ్లను నిర్మించాలని భావించారు. ఆధునిక సీటింగ్, సీలింగ్ ఎలివేషన్‌తో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నది ఆనాటి ప్రతిపాదన. దానికి అనుగుణంగా ప్రజాప్రతినిధులు శంకుస్థాపన కూడా చేశారు.

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–1లోని వీఎంఆర్‌డీఏ కల్యాణ మండపాన్ని కూల్చివేసి కొత్త నిర్మాణం చేపట్టాలన్నది తూర్పు నియోజకవర్గ ప్రజల చిరకాల ఆకాంక్ష. దశాబ్దాల కిందట వీఎంఆర్‌డీఏ నిర్మించిన ఈ మండపం శిథిలం కావడంతో చాలా ఏళ్లుగా ఇక్కడ కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన నిర్మాణం చేపట్టాలని స్థానికులు చాలా కాలంగా కోరుతున్నారు. దీంతో గత ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త



కల్యాణ మండపం ఆవరణలో కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి గత ప్రభుత్వం శంకుస్థాపన చేసిన శిలాఫలకం

కన్వెన్షన్ హాల్ నిర్మించేందుకు ప్రతిపాదనలు చేసింది. ఇందుకు అనుగుణంగా అప్పటి వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ రూ.4.15 కోట్ల నిధులతో కొత్తగా కన్వెన్షన్ హాల్ నిర్మించేందుకు శంకుస్థాపన సైతం చేశారు. తరువాత ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభం కాలేదు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్త కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి మంగళం పలికింది. పూర్తి స్థాయిలో శిథిలమైన పాత కల్యాణ మండపానికి మేడిపండు మెరుగులు దిద్దుతోంది.



కల్యాణ మండపం పూర్తిగా శిథిలమైన ఆనవాళ్లు

కూటమి ప్రభుత్వంలో చరమగీతం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తూర్పు నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష అయిన కొత్త కన్వెన్షన్ హాల్ నిర్మాణం కొండెక్కింది. నిధుల కొరత పేరుతో పాత కల్యాణ మండపానికి మేడిపండు మెరుగులు దిద్దేందుకు ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ అధికారులు పనులు ప్రారంభించారు. రూ.31 లక్షలతో ప్రస్తుతం ఆయా పనులు జరుగుతున్నట్లు సమాచారం. సీలింగ్, కూలిపోయిన కాంపౌండ్ వాల్ నిర్మాణం, ఫ్లోరింగ్, మెట్లు, నీరుగారుతున్న పైకప్పునకు మరమ్మతులు వంటి పనులు చేపట్టారు. ఇప్పటికే కూలిపోయే స్థితికి చేరుకున్న కల్యాణ మండపానికి రూ.31 లక్షలు ఖర్చు చేసి మెరుగులు దిద్దడమేంటని, ఎవరి మెప్పు కోసం ఈ పనులు జరుగుతున్నాయని తూర్పు నియోజకవర్గ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త కన్వెన్షన్ హాల్ నిర్మాణాన్ని పక్కన పెట్టి పాత భవనానికి మెరుగులు దిద్దడమేంటనేది వారి వాదన. పూర్తిగా శిథిలమైన భవనానికి మెరుగులు దిద్దినా కొంతకాలానికే మళ్లీ పాడయ్యే పరిస్థితి వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం చేపట్టిన ఆధునికీకరణ పనులు వృథా ప్రయాసేనని పేర్కొంటున్నారు. అధికారులు పునరాలోచించి ప్రజా ప్రయోజనకర నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. పైనాపిల్ కాలనీ సబ్ స్టేషన్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పైనాపిల్ కాలనీ, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, సీబీడీ రీజనల్ కార్యాలయం, కామాక్షినగర్, ఎస్‌ఎస్‌ఎన్ నగర్, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, శ్రీకాంత్‌నగర్, కనకమహాలక్ష్మి నగర్, పాండురంగాపురం, ప్రగతి నగర్, రాజీవ్‌నగర్, లక్ష్మీనగర్, శివాజీనగర్, పాత పోలీస్ స్టేషన్, నెహ్రూ నగర్, టీబీసీ పాయింట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కైలాసగిరి ఫీడర్‌లో..

విమ్స్ సబ్ స్టేషన్‌కు సంబంధించిన కైలాసగిరి ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక, బి.ఎస్.ఆర్.నగర్, తోటగరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఏయూ సబ్‌స్టేషన్ పరిధిలో..

మద్దిలపాలెం: ఈపీడీసీఎల్ జోన్–1 పరిధిలోని ఏయూ అవుట్ గేట్ వద్ద గల సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్న ఒంటి గంట వరకూ ఏయూ అవుట్ గేట్ పరిధిలోని ఏపీ ఫైబర్ నెట్ కార్యాలయం, కలెక్టర్ బంగ్లా, కిర్లంపూడి లేఅవుట్, సిరిపురం, ఏయూ అవుట్ గేట్, చినవాల్తేరు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సిరిపురం పరిధిలో..

ఎంవీపీకాలనీ: నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సిరిపురం పెట్రోల్ బంక్, కలెక్టర్ బంగ్లా, కిర్లంపూడి లే అవుట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



శ్రీకాకుళం పర్యటనలో భాగంగా గురువారం విశాఖ ఎయిర్‌పోర్టులో ట్రాన్సిట్‌హాల్ట్ చేసిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జాతీయ సమైక్యత శిబిరంలో చరణ్ ప్రతిభ



శిబిరంలో పాల్గొన్న విద్యార్థి చరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: పంజాబ్ రాష్ట్రం చండీఘడ్‌లో ఈ నెల 5 నుంచి 11 వరకు జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ థర్డ్ ఇయర్ చదువుతున్న ఎం.ఎ.సి.చరణ్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు విద్యార్థి చరణ్‌ను తన చాంబర్‌లో అభినందించారు. శిబిరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడంటూ ప్రశంసించారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు, జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి, బి.నాగేశ్వరరావు తదితరులు చరణ్‌కు అభినందనలు తెలిపారు.

రైతుల నుంచి సేకరించి.. టమాటాల విక్రయాలు



ఎంవీపీ రైతుబజార్‌లో వినియోగదారులకు టమాటాలు విక్రయిస్తున్న వ్యాపారి

ఆరిలోవ: మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో రైతుబజార్లలో సభ్యత్వం లేని జిల్లాలో రైతుల వద్ద టమాటాలు సేకరిస్తున్నారు. వాటిని రైతుబజార్లలో విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా కొత్తూరులో ఓ రైతు నుంచి 9.50 క్వింటాళ్ల టమాటాలు సేకరించి గురువారం ఎంవీపీ రైతుబజార్‌కు తీసుకువచ్చారు. ఇక్కడ వాటిని వినియోగదారులకు రైతుబజార్‌లో నిర్ణయించిన (గురువారం టమాటా కిలో రూ.11) ధరకు విక్రయించినట్లు ఈవో వరహాలు తెలిపారు. పొలంలో పండించే రైతు వద్దకే వెళ్లి సేకరించిన టమాటాలన్నారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు కనకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు



డివైడర్ పైకి దూసుకెళ్లిన కారు

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీ దరి బీచ్ రోడ్డులో గురువారం ఉదయం ఓ కారు బీభత్సం సృష్టించింది. ఉదయం 8.30 గంటల సమయంలో వాల్తేర్ డిపో కూడలి నుంచి అప్పుఘర్ వైపు వస్తున్న కారు లాసన్స్ బే పెట్రోల్ బంక్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టింది. అతివేగం కారణంగా కారు అదుపుతప్పి ఇనుప రైలింగ్‌ను గుద్దుకుంటూ దూసుకెళ్లింది. డివైడర్ పైనుంచి అవతలి వైపు రోడ్డుపైకి వెళ్లి నిలిచిపోయింది. ఆ సమయంలో పక్కనే ఎలాంటి వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో డివైడర్‌కు ఇరువైపులా ఉన్న రైలింగ్ విరిగిపోగా.. మధ్యలోని మొక్కలు నుజ్జయ్యాయి. ప్రమాదానికి గురైన కారును ఓ మహిళ నడుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు వెల్లడించారు.

బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జీఎస్‌ఎన్ రాజు

ఆరిలోవ: బీఎస్‌ఎన్‌ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆల్ ఇండియా బీఎస్‌ఎన్‌ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్(ఏఐబీడీపీఏ) అసిస్టెంట్ సర్కిల్ సెక్రటరీ జి.ఎస్.ఎన్.రాజు విజ్ఞప్తి చేశారు. 9వ వార్డు విశాలాక్షినగర్‌లో గురువారం ఏఐబీడీ పీఏ విశాఖ కమిటీ సభ్యులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీఎస్‌ఎన్‌ఎల్ విశ్రాంతి ఉద్యోగుల పెన్షన్ సవరణలు చేపట్టాలని, ఉద్యోగుల మూడో వేతన సవరణ తక్షణమే ప్రకటించాలన్నారు. పెన్షన్ రివిజన్‌తోపాటు 4జీ, 5జీ సేవలు వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఉద్యోగులకు 2017 నుంచి 15 శాతం ఫిట్మెంట్‌తో వేతన సవరణ జరగాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు జరగలేదన్నారు. పెన్షనర్లకు మెరుగైన నగదు రహిత వైద్య సేవలు అందించాలని, పాత పెన్షన్ స్కీం పునరుద్ధరించాలని, స్థిర వైద్య భృతి నెలకు రూ.5,000 చెల్లించాలని, రోడ్డు, రైలు, విమాన ప్రయాణాల్లో 50 శాతం రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 14న విజయవాడలో జరిగిన ఆల్ ఇండియా బీఎస్‌ఎన్‌ఎల్‌డీఓటీ ఆంధ్రప్రదేశ్ మూడో సర్కిల్ కాన్ఫరెన్స్‌లో నియమించిన నూతన కార్యవర్గంలో తనను రాష్ట్రం నుంచి సర్కిల్ సెక్రటరీగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏఐబీడీ పీఏలో విశాఖ జిల్లా నుంచి 900 మంది సభ్యులున్నారన్నారు. సమావేశంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు జి.గోవిందరావు, సభ్యులు పి.వి.రమణ, ఎస్.హనుమంతరావు, విజయనగరం జిల్లా సభ్యుడు జి.ఎఫ్.ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

మానసిక సమస్యల పెరుగుదల ఆందోళనకరం




మాట్లాడుతున్న ఆచార్య రాజు

విశాఖ విద్య: సమాజంలో మానసిక సమస్యలు గణనీయంగా పెరుగుతున్నాయని, ఇవి ఎంతో ప్రమాదకరమని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా గురువారం సైకాలజీ విభాగంలో నిర్వహించిన సైకి క్రానికల్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి విభాగంలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తామని చెప్పారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాలను పెంపొందించడానికి, పరిశోధనాసక్తిని కలిగించడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రపంచంలో అత్యధిక శాతం మంది డిప్రెషన్‌తో బాధపడుతున్నారని, ప్రాథమిక దశల్లో మానసిక సమస్యలను గుర్తించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సైకాలజిస్టుల ప్రాధాన్యాన్ని గుర్తించి ఇటీవల పలు ఉద్యోగాలను సైతం భర్తీ చేస్తోందన్నారు. యువతలో ప్రధానంగా వ్యసనాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని, దీనిని నివారించే దిశగా సైకాలజిస్టులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ మానసిక సమస్యలపై చిత్రీకరించిన లఘు చిత్రాలను విభాగంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన ఆకట్టుకుంది. సైన్స్ కళాశాల పరిధిలోని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహాగణపతుల ఉపాసన ఉత్కృష్టమైంది



ప్రవచిస్తున్న షణ్ముఖశర్మ



పూజలందుకున్న మహాగణపతి

ఎంవీపీకాలనీ: శ్రీ మహాగణపతి వైభవంపై బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు గురువారం కొనసాగాయి. రుషి పీఠం సత్సంగం శాఖ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్క్ వేదికగా ఈ కార్యక్రమం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ షోడశ గణపతుల్లో మహాగణపతుల ఉపాసన ఉత్కృష్టమైందన్నారు. సాత్విక భక్తితో గణపతిని ఆరాధించాలని భక్తులకు సూచించారు. గణపతి ఆరాధనతో సర్వసిద్ధులు లభిస్తాయన్నారు. అంతరంగ దర్శనంతో మాత్రమే ఆధ్యాత్మిక చైతన్యం సిద్ధిస్తుందని ప్రవచించారు. అనంతరం మహాగణపతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వాహకులు కె.వి.ఎస్.శ్యామ్, కందాళ అరుణ గాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నియంత్రణ



మాట్లాడుతున్న అగ్నిమాపక శాఖ ప్రాంతీయ అధికారి నిరంజన్ రెడ్డి

మహారాణిపేట: హోటళ్లలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకునే భద్రత అతిథులు, సిబ్బంది శ్రేయస్సు పట్ల ఆయా సంస్థలు తీసుకునే శ్రద్ధను నిర్ధారిస్తాయని ప్రాంతీయ అగ్నిమాపక అధికారి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఆంధ్రప్రదేశ్ టూరిజం ఫోరం సంయుక్తంగా గ్రీన్ పార్క్ హోటల్లో నిర్వహించిన అగ్నిమాపక భద్రతా శిఖరాగ్ర సమావేశాన్ని జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. సదస్సులో పాల్గొన్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. హోటల్ టూరిజం సబ్ కమిటీ చైర్మన్ ఎంవీ పవన్ కార్తీక్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఏపీ టూరిజం ఫోరం కార్యదర్శి కార్తీక్ హాజరైన వారికి కృతజ్ఞతలు తెలిపారు. చీఫ్ ఇంజినీర్లు, స్టార్ హోటళ్ల భద్రత ఇన్‌చార్జిలు, ఫైర్ ట్రైనర్ ఎస్పీబీ రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు

- పదో తరగతి విద్యార్థులతో డీఈవో

ఆరిలోవ: పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు ఒక ప్రణాళికతో చదవాలని డీఈవో ప్రేమ్‌కుమార్ సూచించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సాయంత్రం ఆయన సందర్శించారు. స్టడీ అవర్‌లో ఉన్న టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. వారిని హిందీ సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నలు అడిగారు. పరీక్షలకు ఏవిధంగా చదవాలో తెలియజేశారు. క్రమశిక్షణ, ప్రణాళికతో చదవడం అవసరమని, తద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల విషయంలో పర్యవేక్షణ అవసరమని ఉపాధ్యాయులకు డీఈవో సూచించారు. ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ, పాఠశాల హెచ్‌ఎం భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణ శిబిరం సందర్శన



అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల జ్ఞానజ్యోతి శిక్షణ శిబిరాన్ని గురువారం డీఈవో ప్రేమ్‌కుమార్ సందర్శించారు. శిక్షణ జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. శిక్షణను సద్వినియోగపరుచుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆయన సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మంచి పునాది వేయడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం తోటగరువు హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను డీఈవో పరిశీలించారు. కార్యక్రమంలో ఎఈవోలు రవీంద్రబాబు, అనురాధ, ఎంఆర్‌పీలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం అందరికీ అందాలి



అంబేడ్కర్ లా కాలేజ్ ప్రిన్సిపాల్ సీతామాణిక్యంను సత్కరిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లా కాలేజ్, ఆంధ్రా యూనివర్సిటీలోని సోషల్ ఇన్‌క్లూజన్ అధ్యయన కేంద్రం సంయుక్తంగా గురువారం వికసిత్ భారత్–2047 కోసం 'సామాజిక న్యాయం – ఆధునిక ప్రతిబింబాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించాయి. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఏయూలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏయూ అంబేడ్కర్ లా కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్.కె.సీతామాణిక్యం మాట్లాడుతూ ఒక న్యాయమైన సమాజం అనేది దేశంలోని అన్ని పౌరులకు సమాన హక్కులను అందించడానికి ఉండాలన్నారు. పేద, వర్గాలైన అంగవైకల్యులు, లింగ గమనం దుర్వినియోగం చేసిన కేసులు సామాజిక న్యాయంలో చేసుకున్న ఉదాహరణలను ప్రస్తావించారు. భారత రాజ్యాంగంలో సామాజిక న్యాయాన్ని మూల సూత్రంగా పేర్కొన్నారు. సంబంధించిన విధానాల కింద ప్రభుత్వం తీసుకున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఆచార్య సీతామాణిక్యంను నిర్వాహకులు సన్మానించారు. డాక్టర్ వి.రాజ్యలక్ష్మి, డాక్టర్ కె.పల్లవి, డాక్టర్ ఎస్.బి.చంద్రకళ, డాక్టర్ పి.సుబ్బారావు తదితరులు ప్రసంగించారు.

అత్యవసర సేవలపై హైవే పెట్రోలింగ్ పోలీసులకు శిక్షణ



ప్రమాదానికి గురైన వ్యక్తికి సీపీఆర్ చేస్తున్న వైద్యురాలు

ఆరిలోవ: అనకాపల్లి జిల్లా పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో పోలీసులు హైవే పెట్రోలింగ్ నిర్వహించే సమయంలో అందించే అత్యవసర సేవలపై విశాలాక్షినగర్‌లోని కైలాసగిరి ఏఆర్ పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు తక్షణ సహాయం అందించడం, వారికి అవసరమైన ప్రథమ చికిత్స, సీపీఆర్ చేయడం, దగ్గరలో ఉన్న ఆస్పత్రులకు అత్యవసరంగా తరలించడం తదితర వాటి గురించి పోలీసులకు వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ఈ శిక్షణ వల్ల హైవేపై ప్రమాదాలకు గురైన వారికి ఆ సమయంలో పెట్రోలింగ్ పోలీసులు అత్యవసరంగా సమర్థవంతమైన సేవలు అందించడానికి అవగాహన కలుగుతుందన్నారు. అనకాపల్లి జిల్లా పోలీస్ యూనిట్‌కు చెందిన వైద్యులు పోలీసులకు అత్యవసర సేవలపై అవగాహన కల్పించారని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ పి.నాగేశ్వరరావు, అనకాపల్లి పోలీస్ యూనిట్ డాక్టర్ తబస్సుం అరా, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.


క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రతి ఒక్కరూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడంతో క్యాన్సర్ మహమ్మారిని ముందుగా గుర్తించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రేసవానిపాలెంలోని తన కార్యాలయంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖకు చెందిన ప్రోగ్రాం అధికారులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులను ఉద్దేశించి మాట్లాడారు. గత నెల 20 నుంచి ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సిబ్బంది క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా నేషనల్ కమ్యూనికల్ డిసీజెస్ నివారణ కార్యక్రమం, జనాభా ఆధారిత స్క్రీనింగ్ ప్రోగ్రాం, మధుమేహం, అధిక రక్తపోటు, సాధారణ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రోస్టర్ మార్చాకే.. మెయిన్స్ నిర్వహించాలి



ఎంపీ భరత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రూప్–2 అభ్యర్థులు

ఎంవీపీకాలనీ: ఏపీపీఎస్సీ గ్రూప్–2 నోటిఫికేషన్ రోస్టర్‌లో తలెత్తిన తప్పిదాలను సవరించాకే మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని అర్హులైన అభ్యర్థులు డిమాండ్ చేశారు. 2వ రోజు నిరసనల్లో భాగంగా గురువారం ఉదయం ఎంవీపీ కాలనీలోని ఆర్‌సీ రెడ్డి కోచింగ్ సెంటర్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. 500 మందికి పైగా అభ్యర్థులు పాల్గొని పరీక్ష వాయిదా వేయాలని, రోస్టర్ సవరించాలని డిమాండ్ చేశారు. సాయంత్రం లాసన్స్ బే కాలనీలోని విశాఖ ఎంపీ భరత్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ఏపీపీఎస్సీ బోర్డుకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. పరీక్ష వాయిదాకు ఎంపీ భరత్ చర్యలు తీసుకోవాలని నినదించారు. పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ నెల 23న మెయిన్స్ నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. ఈ పరీక్షను రద్దు చేసి రోస్టర్‌ను సవరించిన తరువాతే మెయిన్స్ నిర్వహించాలని కోరారు.